## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

- మూడు గంటల కరెంట్ చాలంటూ టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

# కరెంట్‌కు మొండిచెయ్యి

- మండిపడుతున్న కర్షకలోకం
- 10 హెచ్‌పీ మోటర్లతో నిత్యం గండమే..
- కౌలుదారు కాలం పెడితే హక్కులు కోల్పోతామంటూ భయపడుతున్న రైతన్నలు



### కాంగ్రెస్ వస్తే.. రైతు బతుకు నాశనమే..

రైతులకు 3 గంటల కరెంటు చాలు అనడం కాంగ్రెస్ నాయకుల అవగాహన రాహిత్యం, అవి పిచ్చి మాటలు, వ్యవసాయానికి 3 గంటలు ఎక్కడ సరిపోతది. ఆరుతడి పంటలకు కూడా సాలదు. కాంగ్రెస్, టీడీపీల పాలనలో కరెంట్ సరిగా లేక పంటలు ఎండబెట్టుకున్నాం. కరెంట్ కోసం పగలు రాత్రి పొలాల వద్దే పడిగాపులు కాసే వాళ్లం. ఎప్పుడో వస్తే అందరం మోటర్లు పెట్టుకొంటే లోడు ఎక్కువై మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేవి. వాటిని రిపేరుకు తీసుకుపోతే రెండు మూడు రోజులు పట్టేది. పదేండ్లలో ఎక్కడా కూడా కరెంట్ సమస్య లేదు. మోటర్లు కాలడం లేదు. పంటలు ఎండిపోవడం అనేది కనిపించడం లేదు. వ్యవసాయం అంటే పండుగలా మారింది. తెలంగాణలో సీఎం కేసీఆర్ రైతులకు 24 గంటలు కరెంట్ ఇస్తుండడంతో ఎక్కడా కరెంట్‌తో ప్రమాదాలు లేవు. రైతుల ఆత్మహత్యలు లేవు. ఇప్పుడున్నట్టే 24 గంటల కరెంట్ ఉండాలి. సీఎం కేసీఆర్ సారే మరోసారి అధికారంలో ఉండాలి. కాంగ్రెస్ వాళ్లు అధికారంలోకి వస్తే మాత్రం రైతు బతుకు నాశనమే.

**- సురేందర్‌రెడ్డి, రైతు, ఆవంచ, తిమ్మాజిపేట మండలం**

### రెండు మడులు కూడా పారదు..



రైతులకు మూడు గంటల కరెంట్ అసలు సరిపోదు. మూడు గంటలు కరెంట్‌తో రెండు మడులు కూడా పారదు. దీంతో వ్యవసాయం చేసుకోవడం ఇబ్బందికరమే. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం 24 గంటలపాటు కరెంట్ ఇస్తుంది. దీంతో మేం ఎప్పుడైనా వెళ్లి పొలానికి నీరు పెట్టుకుంటున్నాం. గతంలో అయితే కరెంట్ కోసం రేయింబవళ్లు పొలాల వద్ద కావలా కాసే పరిస్థితి ఉండేది. ఆ బాధ పూర్తిగా తప్పింది. ఇప్పుడు ఎక్కువగా పగలే వ్యవసాయ పనులు చేసుకుంటున్నాం. కాంగ్రెస్ వారు వస్తే రైతులకు మూడు గంటలు చాలని మాట్లాడుతున్నారు. అది 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని సూచిస్తున్నారంట. రైతులకు 10 హెచ్‌పీ మోటర్లతో ఎలాంటి ప్రయోజనం లేదు. 5వందల పీట్లకు పైగా కిందికి వాటర్ ఉన్నప్పుడు 10 హెచ్‌పీ మోటర్ అవసరం అవుతుంది. ఇప్పుడు ఎక్కడ చూసినా వంద నుంచి రెండు వందల ఫీట్లలోపే వాటర్ ఉంది. కాబట్టి ఇప్పుడు ఉన్న కరెంట్‌తో రైతులకు ఉన్న పొలం అంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు నీళ్లు పెట్టుకోవచ్చు. రైతుకు నాణ్యమైన కరెంట్ ఇస్తున్న ప్రభుత్వానికి అందరూ కృతజ్ఞత చెప్పాలి. సీఎం కేసీఆర్ సారుకు అండగా ఉండాలి.

**- రమేశ్, రైతు,(బోరు మెకానిక్) తలకొండపల్లి**

### 24గంటల కరెంటు వృథా అనడం అవివేకం..

రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల విద్యుత్ అయితనే సరిపోతదని 10 హెచ్‌పీ మోటర్ బిగించుకుంటే మూడు గంటల కరెంట్ రైతులకు సరిపోతుందని 24గంటల కరెంట్ వృథా అని చెప్పడం సిగ్గు చేటు. ఆయనకు ఏమైనా వ్యవసాయం చేసిన అనుభవం ఉందా.. ఎలా మాట్లాడుతాడు. 3 గంటల కరెంట్‌తో ఎకరం పొలం కూడా తడవదు. అంటే వ్యవసాయ చేసుకోవడం బందు పెట్టుకోవాలా.. గతంలో కరెంట్, ఎరువులు, విత్తనాల కోసం రైతులు రోడ్లపై ధర్నాలు, రాస్తారోకోలు చేసే రోజులు పోయి ఇప్పుడు అన్ని సౌలత్‌లతో మంచిగా వ్యవసాయం చేసుకుంటుంటే కండ్లు మండుతున్నట్లున్నయ్ వారికి. అందుకే ఏది పడితే అది వాగుతున్నారు. ఏది ఏమైనా రైతులకు 24 గంటలపాటు కరెంట్ ఇచ్చే సీఎం కేసీఆర్ సారే అధికారంలో ఉండాలి. వ్యవసాయంపై అడ్డదిడ్డం మాట్లాడే వాళ్లను అసలు నమ్మం.

**- మధుసూదన్‌రెడ్డి, రైతు, యాదిరెడ్డిపల్లి**



### మూడు గంటలంటే మూతిమీద కొడతాం..



గత తొమ్మిదిన్నరేండ్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఇస్తున్న 24గంటల కరెంట్‌తో రెండు కారుల(విడుతల) పంటలు పుష్కలంగా పండించుకుంటున్నాం. ఎవ్వడో రేవంత్‌రెడ్డి అంటా...నేను అయితే ఆయనను చూడలే ..రైతులకు 3గంటల కరెంట్ సరిపోతది. 24గంటల కరెంట్ వద్దు అంటున్నాడంట.. మా వాళ్లు అనుకుంటుంటే విన్నా.. ఆయన ఇచ్చే 3గంటల కరెంట్‌తో ఎన్ని ఎకరాలు తడపవచ్చో ఆయన పంటలకు నీళ్లు పారబెట్టి రైతులకు చూపియాలే, ఇష్టం వచ్చినట్లు ఎక్కడనో.. ఉండి రైతులకు మూడు గంటల కరెంట్ కావాలే.. ఈ మోటర్ కావాలే అని మాట్లాడితే.. మూతిమీద కొడతారు రైతులు.

**- చెన్నమ్మ, మహిళా రైతు, పెంట్లవెల్లి మండలం**

### రైతులను ఆగం చేసేందుకే..



పొరపాటున కాంగ్రెస్ పార్టీని నమ్మితే వ్యవసాయం ఆగమావుతుంది. మూడు గంటల కరెంట్ సరఫరా వల్ల పంటలకు సకాలంలో నీరందక పంటలు ఎండిపోయి రైతుకు నష్టం జరిగే ప్రమాదం ఉంటుంది. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ అవసరం లేదని మూడు గంటల కరెంట్ సరిపోతుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అనడం కరెక్టు కాదు. గతంలో పాలించిన కాంగ్రెస్ పార్టీ మూడు గంటల కరెంట్ ఇచ్చింది అప్పుడు కరెంట్ కరెక్టుగా లేక పంటలు ఎండిపోయి నానా ఇబ్బందులు పడినాం, సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక ఈ తొమ్మిదేండ్లలో ఆ బాధలు లేవు. కాంగ్రెసోళ్లు వ్యవసాయానికి 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్నారు ఆ మోటరు కొనాలంటే దాదాపు రూ. 50వేలకు పైగా అవుతుంది. ఆ మోటరు వాళ్లు కొనిస్తారా.. ఇవన్నీ పనికిరాని మాటలు ఇది రైతులను పూర్తిగా ఆగం చేసేందుకే.

**- కడారి పెద్ద సాయిలు, రైతు, జంగారెడ్డిపల్లి, ఆమనగల్లు మండలం**

### కాంగ్రెసోళ్లను నమ్మము..



గతంలో కరెంట్ ఎప్పుడు వస్తదంటూ.. పడిగాపులు కాసేవాళ్లం. కరెంట్ ఎప్పుడువస్తుందో, ఎప్పుడు పోతుందో అసలు తెలియదు. చేతికి వచ్చిన పంట కండ్ల ముందే నీరులేక ఎండిపోతుంటే చూడలేక నరకం అనుభవించినం. కేసీఆర్ ముఖ్యమంత్రి అయినాక రైతులకు రుణమాఫీ, రైతుబంధు, రైతు బీమా, నాణ్యమైన విత్తనాలు, ఉచితంగా 24 గంటల కరెంట్ ఇస్తున్నడు.. మేము పండించిన పంటలకు మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కొంటున్నది. మా కోసం ఇంతగా ఆలోచించే సీఎం కేసీఆర్‌ను కాదని, కాంగ్రెసోళ్లను నమ్మము. రేవంత్‌రెడ్డి లాంటోళ్లు ఎంత మంది వచ్చినా.. మా కేసీఆర్‌కు సరితూగ లేరు..మాకు కేసీఆర్ ప్రభుత్వమే రావాలి.. 24 గంటల కరెంటే కావాలి.

**- వడ్డె రాముడు, రైతు, పెంట్లవెల్లి మండలం**

### కరెంట్‌పై కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నది..

కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసేందుకు కరెంట్‌పై కుట్రలు చేస్తున్నది. 24 గంటలు కరెంట్ ఉండబట్టి మేము ఇక్కడ రెండు పంటలు పండిస్తున్నాం. రోజుకు మూడు గంటలు కరెంటు ఉంటే వ్యవసాయం చేయలేం. పంటలు పండవు. పదేండ్లుగా రైతులు లాభసాటి వ్యవసాయం చేస్తున్నామంటే దానికి ప్రధాన కారణం కరెంట్ కష్టాలు లేకపోవడమే. గతంలో పదే పదే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేతే అనేక ఇబ్బందులు పడే వాళ్లం. కేసీఆర్ సార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత రైతులకు 24 గంటల కరెంట్ ఇచ్చి అన్ని విధాలుగా ఆదుకుంటున్నారు. మళ్లీ కాంగ్రెస్ వస్తే కరెంట్ కోతలు తప్పవు. మాకు కష్టాలు లేకుండా ఉండాలంటే మళ్లీ సీఎం కేసీఆర్ సార్ రావాలి.



**-బొజ్యానాయక్, రైతు, మర్రిపల్లి, చారకొండ మండలం**